# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

SEPTEMBER - 2001

# సంక్షిప్త వార్తలు

పెద్దాపురం మండలం చదలాడ గ్రామంలో ఆగష్టు 10,11 తేదీలలో సువార్త కూటములు, బైబిలు క్లాసులు జరిగెను. ఆ రోజులలో ఉదయకాల కూటములోను, మధ్యాహ్నకాల కూటములోను సోదరులు రిక్కీ గూటం గారు వాక్యపరిచర్యచేసిరి. చక్కటి వాక్యోపదేశం చేసి హాజరైన వందలాది ప్రజలను క్రీస్తు కొరకు ఆకర్షించిరి. సాయంకాల కూటములలో జాషువా గూటం గారు వాక్యపరిచర్యచేసిరి. కూటముల అనంతరం ఇద్దరు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. చదలాడలోను, పరిసర గ్రామములలోను సోదరులు యం.ప్రేమ్‌కుమార్ గారు నమ్మకముగా సువార్త ప్రకటించు చున్నారు.

పశ్చిమగోదావరి జిల్లా భీమడోలు కాలింగపేటలో సోదరులు బుర్రేయోహాను గారు, మరికొంతమంది యువకులు ఆగష్టు 12న సువార్త ప్రకటించగా ముగ్గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. మరియు అదే గ్రామంలో వారు 16వ తేదీన సువార్త ప్రకటించగా ఇద్దరు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. బుర్రేయోహానుగారు కురెళ్లగూడెంలోను, పరిసర ప్రాంతములలోను సువార్త చాటుచున్నారు.

ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెంలో సువార్త చాటుచున్న సోదరులు బి.నాగేశ్వరరావ్ గారు ఆగష్టు 15వ తేదీనాడు ప్రభువు నందు నిద్రించిరి. ఆయన ఉపాధ్యాయ వృత్తిలో యుండి 13 సంఘములు స్థాపించబడుటకు కృషిసల్పిరి. విజయవాడలో యున్న జాన్ బాలసుందరం గారి సహాయ సహకారాలతో ప్రకాశం జిల్లాలో ప్రభువు కొరకు మంచిపని చేయుగల్గిరి. నాగేశ్వరరావ్ గారి సతీమణి జెస్సీకా కొరకు, ఇద్దరు కుమార్తెల కొరకు ప్రార్థించమనవి.

సత్యవాక్కు

THE WORD OF TRUTH

P.O. Box 80, Kakinada, A.P. 533 001

Phone : 0884 - 363722

Editor :

JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 22 సెప్టెంబర్ 2001 సంచిక 2

# మానవుని తత్వము-1

## (The Nature of Man)

బైబిలులో కీర్తనలు గ్రంధములో దావీదు మహారాజు ఇట్లు వ్రాసాడు: "యెహోవా, మా ప్రభువా, ఆకాశములలో నీ మహిమను కనుపరచువాడా, భూమి యందంతట నీ నామము ఎంత ప్రభావము గలది ! ... నీవు కలుగ జేసిన చంద్ర నక్షత్రములను నేను చూడగా నీవు మనుష్యుని జ్ఞాపకము చేసికొనుటకు వాడేపాటి వాడు ? నీవు నరపుత్రుని దర్శించుటకు వాడేపాటి వాడు ? దేవుని కంటె వానిని కొంచెము తక్కువ వానిగా చేసియున్నావు. మహిమా ప్రభావములతో వానికి కిరీటము ధరింప జేసియున్నావు. నీ చేతి

పసుల మీద వానికి అధికారమిచ్చి యున్నావు. గొర్రెలనన్నిటిని ఎడ్లనన్నిటిని అడవి మృగములను ఆకాశపక్షులను సముద్ర మత్స్యములను సముద్ర మార్గములలో సంచరించు వాటినన్నిటిని వాని పాదముల క్రింద ఉంచి యున్నావు. యెహోవా మా ప్రభువా, భూమియందంతట నీ నామము ఎంత ప్రభావము గలది ! " (కీర్తన 8:1-9).

మరల కీర్తన 139:14-17లో అతడిట్లు చెప్పాడు: "నీవు నన్ను కలుగజేసిన విధము చూడగా భయమును ఆశ్చర్యమును నాకు పుట్టుచున్నవి. అందును బట్టి నేను నీకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించుచున్నాను. నీ కార్యములు ఆశ్చర్య కరములు. ఆ సంగతి నాకు బాగుగా తెలిసియున్నది. నేను రహస్యమందు పుట్టిన నాడు, భూమి యొక్క అగాధ స్థలములలో విచిత్రముగా నిర్మింప బడిననాడు, నాకు కలిగిన యెముకలును నీకు మరుగై యుండలేదు. నేను పిండమునై యుండగా నీ కన్నులు నన్ను చూచెను. నియమింపబడిన దినములలో ఒకటైన కాకమునపే, నా దినములన్నియు నీ గ్రంథములో లిఖితము లాయెను. దేవా నీ తలంపులు నాకెంత ప్రియమైనవి ! వాటి మొత్తమెంత గొప్పది!". ఈ రీతిగ మానవుని తత్వాన్ని గూర్చి తన తలంపులను వ్యక్తపర్చుచు దావీదు మహారాజు దేవుని కొనియాడాడు.

## మానవుడు దేవునిచే సృజింపబడిన వ్యక్తి

"దేవుడు-మన స్వరూపమందు, మన పోలికె చొప్పున నరులను చేయుదము...... దేవుడు తన స్వరూపమందు నరుని సృజించెను; దేవుని స్వరూపమందు వాని సృజించెను; స్త్రీని గాను పురుషుని గాను వారిని సృజించెను" అని బైబిలు చెప్పుచున్నది (ఆది.కా. 1:26-27). మరియు "దేవుడైన యెహోవా నేలమంటితో నరుని నిర్మించి వాని నాసికా రంధ్రములలో

జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను" (ఆది.కా. 2:7). "మరియు దేవుడైన యెహోవా-నరుడు ఒంటరిగా నుండుట మంచిదికాదు; వానికి సాటియైన సహాయమును వానికొరకు చేయుదునను కొనెను". "అప్పుడు దేవుడైన యెహోవా ఆదామునకు గాఢనిద్ర కలుగజేసి అతడు నిద్రించినప్పుడు అతని ప్రక్కటెముకలలో ఒకదానిని తీసి ఆ చోటను మాంసముతో పూడ్చివేసెను. తరువాత దేవుడైన యెహోవా తాను ఆదాము నుండి తీసిన ప్రక్కటెముకను స్త్రీనిగా నిర్మించి ఆమెను ఆదామునొద్దకు తీసికొని వచ్చెను. అప్పుడు ఆదాము యిట్లనెను-నా యెముకలలో ఒక యెముక, నా మాంసములో మాంసము, ఇది నరునిలో నుండి తీయబడెను గనుక నారి అనబడును" (ఆది.కా. 2:18; 21-23).

అపొస్తలుడైన పౌలు ఇట్లు చెప్పాడు: "జగత్తును అందలి సమస్తమును నిర్మించిన దేవుడు తానే ఆకాశమునకును భూమికిని ప్రభువై యున్నందున హస్తకృతములైన ఆలయములలో నివసింపడు. ఆయన అందరికిని జీవమును, ఊపిరిని సమస్తమును దయచేయువాడు గనుక తనకు ఏదైన కొదువ యున్నట్లు మనుష్యుల చేతులతో సేవింపబడువాడుకాడు. మరియు యావద్భూమి మీద కాపురముండుటకు ఆయన యొకని నుండి ప్రతిజాతి మనుష్యులను సృష్టించి, వారు ఒకవేళ దేవుని తడవులాడి కనుగొందురేమోయని, తన్నువెదకు నిమిత్తము నిర్ణయకాలమును వారి నివాస స్థలము యొక్క పొలిమేరలను ఏర్పరచెను. ఆయన మనలో ఎవనికిని దూరముగా ఉండువాడుకాడు. మనమాయన యందు బ్రదుకుచున్నాము, చలించుచున్నాము, ఉనికి కలిగియున్నాము" (అపొ.కా. 17:24-28).

ఇట్టిరీతిగా మానవుడు భూమిపై ఉనికిని కలిగియున్నాడు. మానవుడు జీవము గలవ్యక్తి. ఆశ్చర్యకరమైన వ్యక్తి. దేవునిచే సృజింపబడిన వ్యక్తి.

## మానవుడు వివేక విశిష్టమైన వ్యక్తి

Man is a rational being. మానవుని వివేక విశిష్టతను (Rationality) గూర్చి బైబిలు బోధించుచున్నది. మానవుడు యోచించడానికి, ఆలోచించడానికి, గ్రహించడానికి, సంకల్పించడానికి, ఇచ్ఛయించడానికి, నిశ్చయించడానికి, అంచనావేయడానికి, నిరీక్షించడానికి, జ్ఞప్తియుంచుకొనడానికి, సాధించడానికి శక్తిగలవాడు. యివన్నియు మానవ మేధస్సు యొక్క లక్షణములు. యిట్టి లక్షణముల వలన అతడు జంతు జాతినుండి వేరైనవాడు. మానవుడు వివేక విశిష్ట బుద్ధిగల వాడుగనుక అతడు దేవునితో సహవాసము కోరును. అతని ఈ వివేక విశిష్ట మేధస్సును ఉద్దేశించి దేవుడు మాట్లాడును. అందువలన దేవుని మనుస్సును లేదా చిత్తాన్ని ప్రతి మానవుడు తెలిసికోవాలి, పరించి తెలిసికోవాలని దేవుడు కోరుచున్నాడు. మనం దేవుని చిత్తాన్ని నేర్చుకోవాలి, తెలిసికోవాలి, యితరులకు బోధించాలి. యిది మన కర్తవ్యం. మనము "సమస్తమును పరీక్షించి మేలైన దానిని చేపట్టుకొనాలి" (1 థెస్స 5:21). జంతువులకు కాదుగాని మానవునికి మాత్రమే ప్రార్థించే తరుణాన్ని, అంటే దేవునితో సంభాషించే తరుణాన్ని దేవుడు అనుగ్రహించాడు. యిది మానవుని బుద్ధి జ్ఞానములలో ఇమిడియున్న సదవకాశము.

## మానవుడు నైతిక స్వేచ్ఛగలవాడు

దేవుడు మానవుని ఒక మరమనిషి (Robot) లాగ చేయలేదు గాని నైతిక స్వేచ్ఛగలవానిగా చేసెను. ఆదికాండము 3వ అధ్యాయములో ఆదాము హవ్వలు తమ స్వయం నిర్ణయముచొప్పున దేవుడు నిషేధించిన ఫలములను తిని ఈ లోకములోనికి పాపాన్ని తెచ్చారు. దేవుని మాటలకు లోబడుటకు,

లోబడకుండుటకు వారు స్వేచ్ఛ కలిగియుండిరి. వారాయన మాటలకు అవిధేయత చూపుటకు నిశ్చయించుకొన్నారు. గనుక పాపములో పడ్డారు. తత్ఫలితాన్ని అనుభవించారు.

మానవుని వివేక విశిష్టతలో అతని నైతిక ఉనికి మిళితమై యున్నది. అతడు మంచి చెడుగుల విచక్షణ కలిగియున్నాడు. దేవుని చిత్తాన్ని జరిగించుటలో కలిగే ఆనందాన్ని, జరిగించక పోవడంలో యున్న దుఃఖాన్ని అతడెరిగి యున్నాడు. మానవులందరు దేవుని యొద్దకు రావాలని, ఆయనను ప్రేమించాలని ఆయన కోరుచున్నాడు. అయితే బలవంతాన్ని బట్టిగాక, తమ యిష్టపూర్వకంగానే వారట్లుచేయాలని ఆయన కాంక్షించుచున్నాడు. దేవుడు మానవుని స్వేచ్ఛను భంగపరచడు.

## మానవుడు అంతరాత్మను లేక మనస్సాక్షిని కలిగినవాడు

ఈ లక్షణము కూడ అతనిని జంతువుల నుండి వేరుచేయును. ఈ మనస్సాక్షి, లేక అంతరాత్మను దేవుడే తనకు సాక్షిగా మనలో యుంచాడు. అందువలన మన తలంపులు, చేష్టలు దేవుని సన్నిధిలో మంచివో లేక చెడ్డవో మన అంతరాత్మయే మనకు బోధించును. అపో.పౌలు అన్యజనులను గూర్చి యిట్లు చెప్పాడు: "ధర్మశాస్త్రము లేని అన్యజనులు స్వాభావికముగా ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలను చేసిన యెడల వారు ధర్మశాస్త్రము లేని వారైనను తమకు తామే ధర్మశాస్త్రమైనట్టున్నారు. అట్టి వారి మనస్సాక్షి కూడ సాక్ష్యమిచ్చుచుండగను, వారి తలంపులు ఒకదాని మీద ఒకటి తప్పు మోపుచు లేక తప్పులేదని చెప్పుచుండగను ధర్మశాస్త్రసారము వారి హృదయములందు వ్రాయబడినట్టున్నారు". (రోమా 2:14-15).

"నా పితురాచార ప్రకారము నిర్మలమైన మనస్సాక్షితో నేను సేవించుచున్న

దేవుని యెడల కృతజ్ఞుడనై యున్నాను" అని 2 తిమోతి 1:3లో పౌలు చెప్పెను. అతడు యూదుల మహాసభ యెదుట నిలబడి, "సహోదరులారా, నేను నేటి వరకు కేవలము మంచి మనస్సాక్షి గలవాడనై దేవుని యెదుట నడుచు కొంటినని" చెప్పెను (అపొ.కా. 23:1). మరల అపొ.కా. 24:16లో, దేవుని యెడలను, మనుష్యుల యెడలను ఎల్లప్పుడు తన మనస్సాక్షి నిర్దోషమైనదిగా ఉండునట్లు అభ్యాసము చేసుకొనుచుండెనని అతడు చెప్పాడు.

ప్రతివాడు మంచి మనస్సాక్షి కలిగియుండాలి. ఒకనికి బోధింపబడిన దానిని బట్టి అతని మనస్సాక్షి అతని ప్రేరేపించును. అపొ.పౌలు సౌలుగా యున్నప్పుడు క్రైస్తవులను, క్రీస్తు సంఘాన్ని హింసించాడు. మంచి మనస్సాక్షి కలిగియే అట్లు చేసాడు. గాని అతడు చేయునది తప్పు అని తెలిసికొనగానే మార్పుజెంది క్రైస్తవుడయ్యాడు, "తాను సమ్మతించిన విషయములలో తనకు తానే తీర్పు తీర్చు కొనినవాడు ధన్యుడు" (రోమా 14:22).

## మానవుడు కనీసం రెండు భాగములైయున్నాడు

ఒకటి భౌతికం, అది శరీరం, రెండవది ఆత్మీయం. అది అతని ఆత్మ. అందువలన మానవుడు చనిపోయినపుడు, "మన్నయినది వెనకటివలెనే మరల భూమికి చేరును, ఆత్మ దాని దయచేసిన దేవుని యొద్దకు మరల పోవును" (ప్రసంగి 12:7). మన శరీరం ఒక గుడారం. ఆగుడారములో అసలైన మనం నివసించుచున్నాము. "భూమిమీద మన గుడారమైన యీ నివాసము శిథిలమై పోయినను చేతిపని కాక దేవుని చేత కట్టబడినదియు నిత్యమైనదియునైన నివాసము పరలోక మందు మనకున్నదని యెరుగుదుము. ఈ గుడారములో నున్న మనము భారము మోసికొని మూల్గుచున్నాము. ఇది తీసివేయవలెనని కాదుగాని మర్త్యమైనది జీవము చేత మ్రింగివేయబడునట్లు

ఆ నివాసమును దీనిపై ధరించుకొన గోరుచున్నాము. దీని నిమిత్తము మనలను సిద్ధపరచినవాడు దేవుడే" (2 కొరింథీ 5:1-5).

మానవుని శరీరము మర్త్యమైనది. అతని ఆత్మ అమర్త్యమైనది. ఈ శరీరాన్ని విడిచిన తరువాత అతడు నిత్యజీవాన్ని గాని, నిత్యనరకాన్ని గాని అనుభవించును.

(సశేషం)

# తీర్పు నాడు నీవేమి చెబుతావు ?
## (What will you say at the Judgement ?)

భక్తి భావములు గల ప్రతివాడు తీర్పును గూర్చి ఎరిగియున్న వాడే. దేవునితో మానవుడు సమావేశమయ్యే ఈ సంఘటనను గూర్చి బైబిలు విశదముగా బోధించుచున్నది. యేసు ఈ లోకంలో యున్నప్పుడు రాబోవు తీర్పును గూర్చి బోధించారు:

"మనుష్యులు పలుకు వ్యర్థమైన ప్రతిమాటను గూర్చియు విమర్శ దినమున లెక్క చెప్పవలసియుండును. నీ మాటలను బట్టి నీతిమంతుడవని తీర్పుపొందుదువు. నీ మాటలను బట్టియే అపరాధివని తీర్పుపొందుదువు" (మత్తయి 12:36-37).

"తండ్రి యెవనికిని తీర్పుతీర్చడు గాని తండ్రిని ఘనపర్చునట్లుగా అందరు కుమారుని ఘనపరచవలెనని తీర్పుతీర్చుటకు సర్వాధికారము కుమారునికి అప్పగించియున్నాడు" (యోహాను 5:22).

"నన్ను నిరాకరించి నా మాటలను అంగీకరింపని వానికి తీర్పుతీర్చు వాడొకడు కలడు; నేను చెప్పిన మాటయే అంత్యదినమందు వానికి తీర్పుతీర్చును" (యోహాను 12:48). అపొస్తలుడైన పౌలు కూడ తీర్పును గూర్చి ఇట్లుచెప్పాడు:

"ఆ అజ్ఞానకాలములను దేవుడు చూచి, చూడనట్లుగా ఉండెను; ఇప్పుడైతే అంతటను అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించు చున్నాడు. ఎందుకనగా తాను నియమించిన మనుష్యుని చేత భూలోకమునకు తీర్పుతీర్చబోయెడి యొకదినమును నిర్ణయించియున్నాడు. మృతులలోనుండి ఆయనను లేపినందున దీని నమ్ముటకు అందరికిని ఆధారము కలుగజేసి యున్నాడు" (అపొకా. 17:30-31). "ఎందుకనగా తాను జరిగించిన క్రియల చొప్పున అవి మంచివైననుసరే చెడ్డవైననుసరే, దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు మనమందరమును క్రీస్తున్యాయ పీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును" (2 కొరింథీ 5:10). "దేవుని యెదుటను సజీవులకును మృతులకును తీర్పుతీర్చు క్రీస్తుయేసు యెదుటను ... నేను ఆనబెట్టి చెప్పుదేమనగా" (2 తిమో 4:1-2). "మనుష్యులొక్క సారే మృతి పొందవలెనని నియమింపబడెను; ఆ తరువాత తీర్పుజరుగును" (హెబ్రీ 9:27).

అపొస్తలులైన పేతురు యోహానులు కూడ తీర్పును గూర్చి ఇట్లు హెచ్చరించిరి: "భక్తులను శోధనలో నుండి తప్పించుటకును ... శిక్షలో ఉంచబడిన వారిని తీర్పు దినము వరకు కావలిలో ఉంచుటకును ప్రభువు సమర్థుడు" (2 పేతురు 2:9).

తీర్పు దినము యొక్క దృశ్యాన్ని భక్తుడైన యోహాను ఇట్లు వర్ణించాడు:

"మరియు ధవళమైన మహా సింహాసనమును దానియందు ఆసీనుడై యున్న యొకనిని చూచితిని; భూమ్యాకాశములు ఆయన సముఖము నుండి పారిపోయెను; వాటికి నిలువచోటు కనబడకపోయెను. మరియు గొప్పవారేమి కొద్దివారేమి మృతులైన వారందరు ఆ సింహాసనము యెదుట నిలువబడి యుండుట చూచితిని. అప్పుడు గ్రంధములు విప్పబడెను; మరియు జీవగ్రంధమను వేరొక గ్రంధము విప్పబడెను. ఆ గ్రంధముల యందు వ్రాయబడి యున్నవాటిని బట్టి తమక్రియల చొప్పున మృతులు తీర్పుపొందిరి" (ప్రకటన 20:11-13).

## తీర్పును గూర్చిన వాస్తవములు

తీర్పుదినం మానవజాతి యొక్క ఆఖరి విమర్శదినం. "మనలో ప్రతివాడు తన్ను గురించి దేవునికి లెక్క యొప్పగింపవలెను" (రోమా 14:12). లేఖనముల నుండి దిగువ వాస్తవములను గ్రహించుదము:

1. తీర్పు దినమందు మానవుడు తన్ను గూర్చి లెక్క యొప్పగించాలి.
2. అందరు తీర్పు లోనికి వస్తారు.
3. దేవుని వాక్యమును బట్టి తీర్పుతీర్చబడతాది.
4. దాని కొరకు ఇప్పుడే మనం సిద్ధపడాలి.

హిట్లరు అక్కడుంటాడు, స్టాలిన్ అక్కడుండాటు, నెహ్రూ, గాంధీలు అక్కడుంటారు, మార్టిన్‌లూథరు, కేథలిక్కుల పోపు లందరు అక్కడుంటారు. యేసు యొక్క భౌతిక తలిదండ్రులగు యోసేపు మరియలు అక్కడుంటారు. నీ పొరుగువారు, నీ శత్రువులు కూడ అక్కడుంటారు. నీ కుమారుడు, కుమార్తె లక్కడుంటారు. నీ భార్య అక్కడుంటాది. నీవు కూడ అక్కడుంటావు! అది ఖచ్చితం. తీర్పు సింహాసనం అక్కడుంటాది. క్రీస్తుదానిలో ఆసీనులై యుంటారు. ఆయనకు నీవేమి చెబుతావు ?

## కొందరు ఈలాగు చెబుతారు

ప్రభువు ఈలాగన్నారు: " ఆ దినమందు అనేకులు నన్ను చూచి, ప్రభువా, ప్రభువా మేము నీ నామమున ప్రవచింపలేదా? నీ నామమున దయ్యములను వెళ్లగొట్టలేదా ? నీ నామమున అనేకమైన అద్భుతములు చేయలేదా? అని చెప్పుదురు. అప్పుడు-నేను మిమ్మును ఎన్నడును ఎరుగను; అక్రమము చేయువారలారా, నా యొద్ద నుండి పొండని వారితో చెప్పుదును" (మత్తయి 7:22,23).

ప్రతివాడు తన్ను గూర్చిన ఏదో ఒక అభిప్రాయం కలిగి యుండును. అది మంచిదైనా కావచ్చులేదా చెడ్డదైనా కావచ్చును. క్రైస్తవుడని పేరు పెట్టుకొనిన ప్రతివాడు రక్షింపబడిన వాడిననే తలంచవచ్చును. యేసుతో పై మాటలు చెప్పేవారు తమ్మును గూర్చి అట్లే భావించారు. గాని వారు నశించిన స్థితిలో యున్నవారు. సాధారణంగా వ్యభిచారులు, నరహంతకులు, అబద్ధికులు మొదలైన వారు నశించిన స్థితిలో యున్నారని మనం తెలుస్తాము. అయితే తీర్పునాడు యేసుతో మాట్లాడిన వీరు అట్టివారే అన్నట్లు యేమీ కన్పించదు. గాని వారెట్టి వారనగా:

1. క్రీస్తును వెంబడించిన భక్తిగలవారు
2. ఆయన నామముననే పనిచేసినవారు
3. ఆయన నామముననే అద్భుతములు చేసినవారు ! (కనీసం వారు అలాగ అనుకొన్నారు) అయినను వారు నశించిన స్థితిలో యున్నారు.

అనేకులు తాము నశించిన స్థితిలో యున్నామని అనుకోరు. వారు యేసు ప్రభువు పనిలోనే యున్నాముగదా అని తలస్తు తమ్మును తామే మోసపర్చుకొందురు. అట్టి వారిని గూర్చి యేసు ఇట్లుచెప్పారు: "అబద్ధ ప్రవక్తలను గూర్చి జాగ్రత్తపడుడి. వారు గొర్రెల చర్మములు వేసికొని మీ యొద్దకు వత్తురు

కాని లోపల వారు క్రూరమైన తోడేళ్లు" (మత్తయి 7:15). అక్రమము చేయువారి విషయమై అపో.పౌలు ఇట్లు చెప్పాడు: "అట్టివారు క్రీస్తు యొక్క అపొస్తలుల వేషము ధరించుకొనువారై యుండి, దొంగ అపొస్తలులును మోసగాండ్రగు పనివారునైయున్నారు. ఇది ఆశ్చర్యము కాదు; సాతాను తానే వెలుగు దూత వేషము ధరించుకొనుచున్నాడు, గనుక వాని పరిచారకులును నీతి పరిచారకుల వేషము ధరించుకొనుట గొప్ప సంగతికాదు. వారి క్రియలచొప్పున వారికంతము కలుగును" (2 కొరింథీ 11:13-15).

## వారెందుకు నశించారు ?

భక్తిగలవారివలె కనబడుచు, అక్రమము చేయుచున్న వారెందరుకు నశించారో ప్రభువే జవాబిచ్చుచున్నారు. ఆయన యిట్లన్నారు: "ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడుగాని పరలోక మందున్న నా తండ్రి చిత్తప్రకారము చేయువాడే ప్రవేశించును" (మత్తయి 7:21).

"కాబట్టి ఈ నా మాటలు విని వాటి చొప్పున చేయు ప్రతివాడును బండమీద తన యిల్లుకట్టుకొనిన బుద్ధిమంతుని పోలియుండును. వాన కురిసెను, వరదలు వచ్చెను, గాలి విసరి ఆ యింటి మీదకొట్టెను గాని దాని పునాది బండ మీద వేయబడెను గనుక అదిపడలేదు. మరియు ఈ నా మాటలు విని వాటి చొప్పున చేయని ప్రతివాడును ఇసుకమీద తన యిల్లు కట్టుకొనిన బుద్ధిహీనుని పోలియుండును. వానకురిసెను, వరదలువచ్చెను, గాలివిసిరి ఆ యింటి మీద కొట్టెను. అప్పుడది కూలబడెను; దాని పాటు గొప్పదని చెప్పెను" (మత్తయి 7:24-27).

భక్తి పరులవలె నటించినవారు ప్రభువు చిత్తప్రకారము చేయలేదు గనుక

నశించిరి. ప్రభువా, ప్రభువా అని ఆయనను పిలిచారుగాని ఆయన చెప్పినట్లు చేయలేదు. గనుక ఆయన నామమును బట్టి ప్రవచించడం, అనేకమైన అద్భుతాలు చేయడం, వగయిరా సరిపోదు. మనం ప్రభువు చిత్తప్రకారము చేయాలి ! గాని ఆయన పేరునే వాడుకొంటూ మన చిత్తాన్ని జరిగించకూడదు.

## యేసు మాటలను బట్టి తీర్పు

యేసుచెప్పిన మాటలను బట్టి మనకు తీర్పు జరుగునని బైబిలు బోధించు చున్నది. యేసు యొక్కయు, పరిశుద్ధాత్ముని యొక్కయు మాటల చొప్పున మనం చేయాలి. అపొస్తలులు పరిశుద్ధాత్మావేశముచే లిఖించిన మాటలను నిరాకరిస్తే క్రీస్తు యొక్క మాటలను నిరాకరించినట్లే (యోహాను 14:26; 16:13). లోకులు నామాట గైకొనిన యెడల, మీ మాటకూడగై కొందురని ప్రభువు అపొస్తలులకు చెప్పారు. (యోహాను 15:20). అందువలన అపొస్తలుల ద్వారా చెప్పబడిన క్రీస్తు మాటల చొప్పున మనకు తీర్పు తీర్చబడును.

## తీర్పునాడు నీవేమందువు ?

ఆయన ఆజ్ఞలను పాటించుట ద్వారా ప్రభువు యెడల మన ప్రేమను ప్రకటిస్తాము. "మనమాయన ఆజ్ఞలను గైకొనుటయే దేవుని ప్రేమించుట" (1 యోహాను 5:3). ఆ గొప్పదినమందు ప్రభువు చిత్తమును బట్టి మనకు తీర్పు తీర్చబడును. యేసు ప్రభువు ఇట్లు చెప్పారు:

"మీరు క్రొత్తగా జన్మించవలెను" (యోహాను 3:7). "లోకము తన కుమారుని ద్వారా రక్షణపొందుటకే గాని, లోకమునకు తీర్పు తీర్చుటకు దేవుడాయనను లోకములోనికి పంపలేదు. ఆయన యందు విశ్వాసముంచు

వానికి తీర్పుతీర్చబడదు; విశ్వసింపనివాడు దేవుని అద్వితీయ నామమందు విశ్వాసముంచ లేదు గనుక వానికి ఇంతకు మునుపే తీర్పుతీర్చబడెను" (యోహాను 3:17-18). "మీ పాపములు తుడిచి వేయబడునట్లు మారుమనస్సు నొంది తిరుగుడి" (అపొ.కా. 3:19). "గనుక నీవు తడవు చేయుట ఎందుకు? లేచి ఆయన నామమును బట్టి ప్రార్థనచేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసుకొనుము" (అపొ.కా. 22:16).

క్రీస్తు సంఘమందు క్రీస్తుచే చేర్చబడి, మరణ పర్యంతము ఆయనకు నమ్మకముగా యుండుము. తీర్పునాడు ఆయన నీకు నిత్యజీవ కిరీటాన్ని బహూకరించును. (ప్రకటన 2:10).

--జిన్నాత్ ఫోర్డ్


## క్రైస్తవ కీర్తనలు

237 పాటలు గల క్రైస్తవ కీర్తనలు పుస్తకం మరల ముద్రింపబడినది. దానిలో అనేక పాత, క్రొత్త కీర్తనలున్నవి. సత్యవాణిలో ప్రసారము చేయబడుచున్న కీర్తనలు కూడా యున్నవి. ఒక్కొక్క కాపీవెల 18 రూపాయలు. పోస్టేజీ 4 రూపాయలు అదనం. వలయువారు దిగువ చిరునామకు యమ్.ఓ పంపండి. యమ్.ఓ దిగువ కూపను మీద మీ అడ్రసు తప్పక వ్రాయండి:

SATYA VANI, P.O.BOX-80, KAKINADA - 533 001

# దండన ఉందండోయ్ !

అహరోను కుమారులు
నాదాబు అబీహులు
ధూపార్తులు చేతబట్టి
అన్యాగ్నిని తెచ్చిపెట్టి
దైవాగ్నితో దహనమైరి !                (లేవీ 10:1-11)

యాజక బోధక వర్గానికి
అప్పుడే చెప్పాడు దేవుడు
ప్రతిష్ఠితములో లౌకికమును
అపవిత్రత నుండి పవిత్రతను
వేరుపరచుటే తమ విధియుని !

ఆధునిక బోధకులలో కొందరు
నాదాబు అబీహుల వలెనే నేడు
ప్రతిష్ఠితములో లౌకికమును
పవిత్రతలో అపవిత్రతన్ను
చేర్చి కూర్చుకుంటున్నారు పాపాన్ని !

సర్వజ్ఞులమనే స్వనీతిపరులు
ప్రజలు మెప్పునేకోరు పాస్టరయ్యలు
అధర్మకారులైన ఆచార్యులు
ఆత్మ గద్దింపులను అలక్ష్యం చేసేవాళ్లు
ప్రచండాగ్ని దండనకు పాత్రులవ్వరా !!!        (హెబ్రీ 10:26-31)

--యస్.జె. మేడిద
కొణితివాడ.

# బాప్తిస్మము ఏమి కాదు ?
# (What Baptism is not ?)

బాప్తిస్మమనగా యేమిటో మనకు తెలుసు. అయితే బాప్తిస్మము యేమికాదో కూడ తెలుసుకొంటే మనకు ప్రయోజనం కలుగుతాదని నేననుకొనుచున్నాను.

మొదటిగా బాప్తిస్మము భౌతిక సంబంధమైనది కాదు. అది హృదయ సంబంధమైనది. ఆత్మ సంబంధమైనది. యేసును దేవుడు ప్రభువుగాను క్రీస్తుగాను నియమించెనని పేతురు పెంతెకోస్తు నాటి ప్రజలకు తెలియజెప్పెను. తరువాత వారు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెనని అతడు చెప్పెను. వారట్లు చేసిరి. ఎందువలన ? తమ హృదయములో నొచ్చుకొని నందువలన. అందువలన వారిమారుమనస్సు, బాప్తిస్మము హృదయంలో జనింపజేయబడిన క్రియయై యున్నది (అపొ.కా. 2:36-38).

రోమా 6:3-5లో బాప్తిస్మములో మనం క్రీస్తుతో కూడ పాతిపెట్టబడితిమని చెప్పబడినది. బాప్తిస్మములో మనం క్రీస్తు రక్తము దరికి చేరుదుము. అప్పుడు మాత్రమే నూతన జీవితంలో నడుచుకొనుటకు తిరిగిలేతుము. రోమా 6:17-18లో "మీరు పాపమునకు దాసులై యుంటిరిగాని యే ఉపదేశ క్రమమునకు మీరు అప్పగింపబడితిరో దానికి హృదయ పూర్వకముగా లోబడిన వారై పాపము నుండి విమోచింపబడి నీతికి దాసులైతిరి. ఇందుకు దేవుని స్తోత్రము" అని అతడు చెప్పెను. ఇక్కడ కూడ బాప్తిస్మము హృదయ సంబంధమైన క్రియయని మరల చూడగలము.

రెండవదిగా, బాప్తిస్మము శరీరమాలిన్యము తీసివేయుటకు కాదు గాని నిర్మల మనస్సాక్షి నిచ్చునట్టిది యని గమనించుదాం. 1 పేతురు 3:21లో, " దానికి

సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది; అదేదనగా శరీరమాలిన్యము తీసివేయుటకు కాదుగాని యేసుక్రీస్తు పునరుత్థాన మూలముగా దేవుని విషయము నిర్మలమైన మనస్సాక్షి నిచ్చు ప్రత్యుత్తరమే" యని చెప్పబడినది. "నిత్యుడగు ఆత్మ ద్వారా తన్నుతాను దేవునికి నిర్దోషినిగా అర్పించుకొనిన క్రీస్తు యొక్క రక్తము, నిర్జీవ క్రియలను విడిచి జీవము గల దేవుని సేవించుటకు మీ మనస్సాక్షిని ఎంతో ఎక్కువగా శుద్ధిచేయును" అని హెబ్రీ 9:14లో చెప్పబడినది.

మూడవదిగా, బాప్తిస్మము సంఘ సంస్కారము కాదు గాని సువార్త యొక్క ఆజ్ఞయైయున్నది. మనం సమస్త జనాంగములకు బోధించాలి. వారికి తండ్రి కుమార పరిశుద్ధాత్మ నామములోనికి బాప్తిస్మమియ్యాలి (మత్తయి 28:19). "మీరు సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి; నమ్మి బాప్తిస్మము పొందిన వాడు రక్షింపబడును, నమ్మని వానికి శిక్ష విధింప బడునని" కూడ యేసు చెప్పెను (మార్కు 16:15-16). ప్రజలు మారు మనస్సు పొంది బాప్తిస్మము పొందాలని అపొ.కా. 2:38లో పేతురు ఆజ్ఞాపించెను. "యేసు క్రీస్తు నామమునందు వారు బాప్తిస్మము పొందవలెనని ఆజ్ఞాపించెను" అని అపొ.కా. 10:48లో వ్రాయబడియున్నది. బాప్తిస్మము సంఘము యొక్క ఊహాజనితం కాదు. అది దేవుని సంకల్పములో భాగమై యున్నది (లూకా 7:30).

నాల్గవదిగా బాప్తిస్మము నామకరణము చేయు సంస్కారము కాదు, గాని రక్షణ యొక్క షరతు. 'నామకరణ సంస్కారము' బైబిలులోనిది కాదు. పసిపిల్లల బాప్తిస్మమును గూర్చి బైబిలులో ఆజ్ఞగాని, ఉదాహరణగాని ఎక్కడా కానరాదు. పసిపిల్లలు పాపులుకాదు, వారు క్రీస్తునందు విశ్వాసముంచలేరు, మారుమనస్సు పొందలేరు, ఒప్పుకోలేరు. అందువలన వారు బాప్తిస్మమునకు అర్హులుకారు.

పురుషులు స్త్రీలు బాప్తిస్మము పొందవలసినవారు గాని పసిపిల్లలు కాదు (అపొ.కా. 8:12). పాపక్షమాపణ, రక్షణ బాప్తిస్మముతో జతపర్చబడినవి (అపొ.కా. 2:38; 1 పేతురు 3:21).

అయిదవదిగా, మానవుడు నీతిమంతుడుగా తీర్చబడుటకు బాప్తిస్మము అతడు చేసేక్రియ కాదు. దేవుని కృపవలన దేవుడను గ్రహించుచు రక్షణ పొందుటకు దేవుని క్రియ అది. "మనము నీతిననుసరించి చేసిన క్రియల మూలముగా కాక, తన కనికరము చొప్పుననే పునర్జన్మ సంబంధమైన స్నానము ద్వారాను పరిశుద్ధాత్మ మనకు నూతన స్వభావము కలుగ జేయుట ద్వారాను మనలను రక్షించెను" అని తీతు 3:5 చెప్పుచున్నది. ఇక్కడ నూతన జన్మను గూర్చి చెప్పబడినది. యేసు, "ఒకడు క్రొత్తగా జన్మించితేనే గాని అతడు దేవుని రాజ్యమును చూడలేడని" చెప్పెను, మరియు "ఒకడు నీటి మూలముగాను ఆత్మ మూలముగాను జన్మించితేనేగాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని" ఆయన చెప్పెను (యోహాను 3:3,5).

ఆరవదిగా, మనము రక్షింపబడిపోయిన వారమని తెలియజేయు అంతరంగిక కృపకు బాప్తిస్మము బాహ్యగురుతుకాదు. సరిగదా మనపాపములను కడిగి వేసుకొనుటకు మనం చూపించు విధేయత అది, "గనుక నీవు తడవు చేయుట ఎందుకు ? లేచి ఆయన నామమును బట్టి ప్రార్థన చేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగి వేసుకొనుము" అని సౌలుకు చెప్పబడెను (అపొ.కా. 22:16). బాప్తిస్మములో పాపములు కడిగివేయబడును. క్రీస్తు రక్తము మన పాపములను కడిగివేయును (ప్రకటన 1:5).

ఏడవదిగా, రక్షింపబడినవాడు కాదుగాని రక్షింపబడువాడు పొందేది బాప్తిస్మము. కొరింథీయులు విని విశ్వసించి బాప్తిస్మము పొందిరు (అపొ.కా. 18:8). వారట్లు చేయాలని యేసు చెప్పెను. విశ్వాసము, బాప్తిస్మము రక్షణతో ఏకమని

యేసేచెప్పెను (మార్కు 16:16).

చివరిగా, చిలకరింపు, కుమ్మరింపులు బాప్తిస్మము కానేరవు. బైబిలులో కొన్ని నీళ్ల చుక్కలు వారిమీద చిలకరింపబడుట, కుమ్మరింపబడుట దానిని బాప్తిస్మమని పిలుచుట మనం ఎక్కడా కనుగొనలేము. ఐతియొపీయ నపుంసకుడు నీళ్లలోనికి దిగెను, నీళ్లలో నుండి వెడలి వచ్చెను (అపొ.కా. 8:38-39). ఎందువలన ? ఏలయనగా బైబిలు బాప్తిస్మము నీటిలో సమాధి, ముంచబడుట, పూర్తిగా కప్పబడుట అయినందువలన (కొలస్స 2:12; రోమా 6:3-5).

మానవులు సరియైన మనస్తత్వము కలిగి అనగా విశ్వాసము మారు మనస్సు కలిగి బాప్తిస్మముపొందాలి. వారు సరియైన విధానములో బాప్తిస్మము పొందాలి, ముంచబడాలి, సరియైన ప్రయోజనం కొరకు, రక్షణ కొరకు బాప్తిస్మం పొందాలి. క్రొత్తనిబంధన బోధించురీతిగా నీవు బాప్తిస్మము పొందావా ?

--జాన్‌స్టేసీ


## గమనిక గమనిక

జాన్ స్టేసి గారు వ్రాసిన 28 మంచి ప్రసంగములు

**"పరిశుద్ధులకు పాపులకు ప్రసంగాలు"** అనే మంచి పుస్తక రూపములో వెలువడినవి. వలయువారు పదిరూపాయల పోస్టేజి స్టాంపులను గాని, మనియార్డరును గాని దిగువ చిరునామాకు పంపి పొందండి:

**SATYA VANI, P.O. BOX.NO. 80, KAKINADA - 533 001.**

# మోషేవంటి ప్రవక్త
## (A Prophet Like Vnto Moses)

"నీ దేవుడైన యెహోవా నీమధ్యను నావంటి యొక ప్రవక్తను నీ సహోదరులలో నీ కొరకు పుట్టించును. ఈయన మాట నీవు వినవలెను" అని మోషే ఇశ్రాయేలీయులతో చెప్పెను (ద్వితీ 18:16). అతడట్లు చెప్పినపుడు వారికి క్రీస్తును సూచించెను. ఇశ్రాయేలీయులు ఐగుప్తులో బానిసలుగా యుండుట, మోషే నాయకత్వమును బట్టి వారు విడుదల పొందుట, వారు అరణ్య మార్గమున ప్రయాణించి వాగ్దానము చేయబడిన కానాను దేశములో చివరకు చేరుకొనుట యనునవన్నియును క్రీస్తు ద్వారా దేవుడు మానవుని పాపము నుంచి విముక్తునిగా చేయు పథకముయొక్క మాదిరి లేక ఛాయగా మనకు పాతనిబంధనలో కన్పడుచున్నవి. అందుకే "ఈ సంగతులు దృష్టాంతముగా వారికి సంభవించి, యుగాంతమందున్న మనకు బుద్ధి కలుగుటకై వ్రాయబడెనని" అపొ.పౌలు 1 కొరింథీ 10:11లో పలికెను.

ఈ రోజు, యేసు క్రీస్తు యొక్క ఛాయవలె పాత నిబంధనలో మోషే మనకెట్లు కన్పడుచున్నాడో చూచుకొందము. అతడు క్రీస్తును గూర్చి ప్రవచించుచు ఆయన 'నావంటి ప్రవక్త' అని పలికెను. గనుక క్రీస్తుకు మాదిరిగా మోషే జీవితము ఎట్లున్నదో తెలిసికొందము. అయితే వీరిద్దరిలోను ఒక గొప్ప వ్యత్యాసమున్నది. మోషే కేవలము మానవుడు, యేసు అయితే దేవుని అద్వితీయ కుమారుడు, దేవుడు. అనేక విషయాల్లో మోషే బలహీనుడు, అసంపూర్ణుడు. యేసు అయితే సంపూర్ణుడు. ఆయన దైవ మానవుడు.

## జననంలో సారూప్యం

మోషే యేసుక్రీస్తులు జన్మించినప్పుడు జరిగిన సంగతులను గమనించిన యెడల అవి యించుమించు ఒకేలాగున్నవి. మోషే జన్మించినప్పుడు ఇశ్రాయేలీయులకు పుట్టిన ప్రతి మగ శిశువు చంపివేయబడవలెనని ఐగుప్తుదేశపు రాజు ఆదేశించెను. అతడు మంత్రసానులతో "మీరు హెబ్రీ స్త్రీలకు మంత్రసాని పనిచేయుచు వారిని కాన్పుల పీటలమీద చూచినప్పుడు మగవాడైన యెడల వాని చంపుడి, ఆడుదైన యెడల దానిని బ్రదుకనియ్యుడని వారితో చెప్పెను" (నిర్గ 1:16). అయితే ఆ మంత్రసానులు దేవునికి భయపడి ఐగుప్తురాజు తమ కాజ్ఞాపించినట్లు చేయక మగపిల్లలను బ్రదుకనియ్యగా, "ఫరో-హెబ్రీయులలో పుట్టిన ప్రతి కుమారుని నదిలో పారవేయుడి, ప్రతి కుమార్తెను బ్రదుకనియ్యుడి అని తన జనులందరికి ఆజ్ఞాపించెను" (నిర్గమ 1:22). ఈ లోగా ఒక హెబ్రీ స్త్రీకి మోషే జన్మించెను. బాలుడు సుందరుడై యుండుట చూచి ఆమె వానిని మూడునెలలు దాచెను. తరువాత ఆమె వానిని దాచలేక ఒక జమ్ము పెట్టె తీసికొని అందులో ఆ పిల్లవానిని పెట్టి యేటి ఒడ్డున జమ్ములో దానిని ఉంచెను. ఫరో కుమార్తె స్నానము చేయుటకు ఆ ఏటికి వచ్చి పెట్టెలోని ఆ పిల్లవానిని కనుగొని అతనిని తన కుమారునిగా పెంచుకొనెను. ఆమె అతనిని నీటిలో నుండి తీసెను గనుక అతనికి మోషే అను పేరుపెట్టెను.

యేసు జన్మించినప్పుడు యూదులకు రాజుగా ఉన్నవాడు పుట్టెనని హేరోదురాజు గ్రహించి బహు కలతజెంది బత్లెహేములోను దాని సకల ప్రాంతములలోను రెండు సంవత్సరములు మొదలుకొని తక్కువ వయస్సుగల మగపిల్లల నందరిని వధించెను (లూకా 2:16). అయితే ప్రభువు దూత యోసేపుకు ప్రత్యక్షమై హేరోదు పసిబాలుడైన యేసును సంహరింపవలెనని వెదుకుచున్నాడు గనుక నీవు లేచి ఆ శిశువును ఆయన తల్లిని వెంటబెట్టుకొని

ఐగుప్తునకు పారిపొమ్మని తెలియజెప్పెను. హేరోదు చనిపోయిన తరువాత మరల యోసేపు, మరియలు యేసుతో సహా ఇశ్రాయేలు దేశమునకు తిరిగివచ్చిరి. వారు నజరేతను ఊరికి వచ్చి అక్కడ కాపురముండిరి.

ఈ ఇద్దరి సందర్భములలోను వారు శిశువులుగా యున్నప్పుడు దేవుని యొక్క హస్తమువలన రక్షింపబడినట్లు మనము గ్రహించగలము.

## పరిచర్యలో సారూప్యం

మోషే, యేసులు మానవులకు సేవ చేయుటకు అత్యున్నత స్థానమును విడనాడిరి. మోషే ఫరోరాజు భవనములో సమస్త సుఖ సంపదలతోను, ధన ధాన్యములతోను, భోగ భాగ్యములతోను ఒక రాజకుమారునివలె పెరిగెను. అయితే "మోషే పెద్దవాడైనప్పుడు విశ్వాసమును బట్టి ఐగుప్తుధనము కంటె క్రీస్తు విషయమైన నింద గొప్ప భాగ్యమని యెంచుకొని అల్పకాలము పాపభోగము అనుభవించుట కంటె దేవుని ప్రజలతో శ్రమ అనుభవించుట మేలని యెంచుకొనెను" (హెబ్రీ 11:24-26). అతడు ఐగుప్తుదేశపు బానిసలగు ఇశ్రాయేలీయుల నాయకుడై వారికి పరిచర్యచేసి వారిని బానిసత్వము నుండి విడిపించెను.

యేసు ఆది నుండియు దేవుడై యుండెను. " ఆయన దేవుని స్వరూపము కలిగిన వాడైయుండి, దేవునితో సమానముగా ఉండుట విడిచిపెట్ట కూడని భాగ్యమని యెంచుకొనలేదు గాని మనుష్యుల పోలికగా పుట్టి, దాసుని స్వరూపము ధరించుకొని, తన్నుతానే రిక్తునిగా చేసికొనెను. మరియు ఆయన ఆకారమందు మనుష్యునిగా కనబడి, మరణము పొందునంతగా, అనగా సిలువ మరణము పొందునంతగా విధేయత చూపినవాడై తన్నుతాను

తగ్గించుకొనెను" (ఫిలిప్పీ 2:6-8). ఆయన ధనవంతుడై యుండియు మనము తన దారిద్ర్యము వలన ధనవంతులు కావలెనని మన నిమిత్తము దరిద్రుడాయెను (2 కొరింథీ 8:9). సిలువపై తన పవిత్ర రక్తాన్ని చిందించెను. పాపపు బానిసలమైన మనలను పాపమునుండి విడిపించెను. మోషే ఇశ్రాయేలీయులకెట్లు పరిచరనా చేసెనో అట్లే క్రీస్తు పాపులకు పరిచర్యచేసి వారిని రక్షించుటకే లోకమునకు వచ్చెను.

మోషే తన ప్రజలను బానిసత్వము నుండి విడిపించుటకు ఏర్పరచబడెను. వారుఫరో ఆధిపత్యము క్రింద బానిసలై అణగద్రొక్కబడుచుండిరి. భరింపరాని భారములను ఫరో వారిపై మోపగా విమోచన కొరకు ఇశ్రాయేలీయులు దేవునికి మొర్రపెట్టిరి. దేవుడు మోషేను వారికి నాయకునిగా పంపించి, బానిసత్వపు సంకెళ్ల నుండి వారిని విడిపించెను. ఈ లోకమంతయు పాపపు సంకెళ్లతో బంధింపబడి యుండగా క్రీస్తు వచ్చెను. మానవులను పాపమునుండి విడుదల చేయుటకు, అవినీతి నుండి నీతికి దాసులనుగా చేయుటకు ఆయన వచ్చెను. ఆయన మేలుచేయుచు ఈ భూమిపై సంచరించెను. పాపభారముతో మూలుగుచున్నవారిని చూచి "ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నా యొద్దకు రండి నేను మీకు విశ్రాంతి కలుగజేతును" అని యేసు ప్రకటించెను (మత్తయి 11:28).

## ధర్మశాస్త్రములిచ్చుటలో సారూప్యం

మోషే, క్రీస్తులు ఇద్దరు ధర్మశాస్త్రముల నిచ్చినవారే. సీనాయి కొండమీద దేవుని ద్వారా ధర్మశాస్త్రమును పొంది మోషే దానిని ఇశ్రాయేలీయుల కిచ్చెను. దానినే మనము మోషే ధర్మశాస్త్రము లేక పాత నిబంధన యని చెప్పుచూ యుంటాము. ఆ ధర్మశాస్త్రమిచ్చుట ద్వారా యూదా జనాంగము లేక మోషే

యుగము ఆరంభమయ్యెను. అది క్రీస్తు మృతులలో నుండి లేచిన తరువాత మొదటి పెంతెకోస్తు దినమున క్రీస్తు సంఘము స్థాపించబడు వరకు అమలులో యుండెను. అప్పటి నుండి క్రీస్తు యుగము ఆరంభమాయెను. క్రీస్తు మృతులలో నుండి లేచి పరలోకమందును భూమి మీదను నాకు సర్వాధికార మీయబడి యున్నది. కాబట్టి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి యని పలికెను (మత్తయి 28:18,19). క్రీస్తు యిచ్చిన చట్టమే క్రొత్త నిబంధన. ఆయన మోషే ధర్మశాస్త్రమును సిలువకు మేకులతో కొట్టివేసి (కొలస్స 2:14), దాని స్థానముననే క్రొత్త నిబంధన నిచ్చెను. మానవులందరు మోషే ధర్మశాస్త్రమును బట్టిగాక క్రీస్తు యిచ్చిన సంపూర్ణనియమమగు క్రొత్త నిబంధనను బట్టి నడుచుకొన వలెనని దేవుడు కోరుచున్నాడు.

## వినయ విధేయతలలో సారూప్యం

దేవుడు తన కాజ్ఞాపించిన వన్నిటిలోను మోషే దేవునికి విధేయుడై యుండెను. భూమి మీదనున్న వారందరిలో అతడు మిక్కిలి సాత్వికుడు (సంఖ్యా 12:3). అట్లే యేసు దేవుని కుమారుడైయుండియు తాను పొందిన శ్రమల వలన విధేయత నేర్చుకొనెను. అందువలన తనకు విధేయులైన వారికందరికిని నిత్యరక్షణకు కారకుడాయెను (హెబ్రీ 5:8-10). మోషే వలెనే యేసుబహు సాత్వికుడు. అందుకే "నేను సాత్వికుడను, దీనమనసుగలవాడను గనుక మీమీద నాకాడి ఎత్తికొని, నాయొద్ద నేర్చుకొనుడి; అప్పుడు మీ ప్రాణములకు విశ్రాంతి దొరుకును" అని ఆయన చెప్పెను (మత్తయి 11:29). మోషే, ఇశ్రాయేలీయులకు గొప్ప సేవజేసెను. నలుబది సంవత్సరములు వారికి నాయకునిగా అతడు పనిచేసెను. వారికి త్రాగుటకు నీళ్ళు అవుసరమైనప్పుడు ఒక బండలో నుండి నీళ్ళు రప్పించెను. అహారముగా దేవుని సహాయము వలన మన్నాను వారికి కురిపించెను. విషసర్పములతో వారు బాధపడు

చున్నప్పుడొక ఇత్తడిసర్పమును వారిమధ్యను నిలబెట్టి వాటినుండి వారిని రక్షించెను. యేసుకూడ రోగులను బాగు చేసెను. ఆకలిగొన్న వారికాహారము నిచ్చెను. దుఃఖములో నున్నవారిని ఓదార్చెను. పాపముచే కాటువేయబడిన వారికి విరుగుడుగా సిలువపై ఆయనే మరణించెను.

ఇశ్రాయేలీయులు ఐగుప్తును విడనాడినప్పుడు "వారందరును సముద్రములో నడచిపోయిరి, అందరును మోషేను బట్టి మేఘములోను, సముద్రములోను బాప్తిస్మముపొందిరి" అని వ్రాయబడి యున్నది (1 కొరింథీ 10:2). క్రీస్తునందున్న విశ్వాసికూడ క్రీస్తులోనికి బాప్తిస్మము పొందవలెను. "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొనియున్నారు" అని గలతీ 3:27లో వ్రాయబడియున్నది. ఇశ్రాయేలీయులను మోషే వాగ్దానము చేయబడిన కానానుకు నడిపించెను. క్రీస్తు ఆజ్ఞలకు విధేయులైన వారిని ఆయన పరలోక విశ్రాంతిలోనికి నడుపును. మోషే ఎంత ఘనుడైనను అతడు క్రీస్తునకు ముందుగా వచ్చిన దాసుడు మాత్రమే. మన రక్షణ నిమిత్తము మనము మోషేను గాక ఇప్పుడు క్రీస్తును వినవలెను. క్రీస్తు సువార్తను నమ్మిబాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును. నమ్మనొల్లనివానికి శిక్ష విధింపబడునని ఆయనే చెప్పుచున్నారు. అందుకే నీ పాపములనుండి నీవు విముక్తుడవు కాగోరుచున్న యెడల ఈనాడే క్రీస్తును వెంబడించుము.

--జాషువా గూటం

ఆగష్టు 21వ తేదీనాడు తూర్పుగోదావరి జిల్లా గుత్తెనదీవి గ్రామంలో నిర్మించబడుచున్న క్రీస్తుసంఘ ఆలయము కొరకు పునాదివేయబడి కట్టడము మొదలు పెట్టబడినది. ఆలయ నిర్మాణము త్వరలో సంపూర్తియగుట కొరకు ప్రార్థించుమని అక్కడ సువార్తికులు యు.స్టాలిన్‌గారు విజ్ఞప్తి చేయుచున్నారు.

ఆగష్టు 23వ తేదీ గురువారంనాడు పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో సువార్తికుల సహవాస కూడిక జరిగెను. ఏలూరు, జంగారెడ్డిగూడెం, తాడేపల్లిగూడెం, భీమవరం వగయిరా ప్రాంతములనుండి సువార్తికులు సకాలమునకు కూడి వచ్చిరి. తాడేపల్లిగూడెం మహాలక్ష్మినగర్‌లో యున్న చక్కటి క్రీస్తు సంఘ ఆలయములో ఈ సహవాసకూటము జరిగెను. స్థానిక సువార్తికులు వి.సహదేవుడు గారు సువార్తికులను, ఆహ్వానితులను పరిచయం చేసిరి. ఉదయకాల కూడికలో సోదరులు జాషువాగూటం గారు భారతదేశంలో క్రీస్తు సంఘ చరిత్రను క్లుప్తముగా వివరించిరి. మధ్యాహ్నకాల కూడికలో సోదరులు బి.జాషువాగారు (ఏలూరు) విశ్వాస భ్రష్టత్వపు మెట్లను వివరిస్తు పాతనిబంధనలో సౌలు యొక్క భ్రష్టత్వాన్ని సవిస్తరముగా వివరించి మంచి బైబిలు పాఠమునుపదేశించిరి. హాజరైన వారందరికీ స్థానిక సంఘము మంచి భోజనము నేర్పాటుచేసిరి. తదుపరి రాత్రివేళ జరిగిన కూటములో జాషువా గూటం గారు స్థానిక సంఘము నుద్దేశించి మంచి వాక్యపరిచర్య చేసిరి. తాడేపల్లిగూడెంలోను, పరిసర ప్రాంతములలోను సోదరులు వి.సహదేవుడు గారు క్రీస్తుకొరకు మంచిపనిని చేయుచు చక్కటి ఫలితములను సాధించుచున్నారు.

ఆగష్టు 24వ తేదీనాడు జాషువా గూటం గారు కృష్ణాజిల్లా ముదినేపల్లి గ్రామం వెళ్లి అక్కడ క్రీస్తు సంఘ ఆలయ నిర్మాణము నిమిత్తము తగు ఏర్పాట్లు చేసియున్నారు. ముదినేపల్లిలో సోదరులు వై.లాజరుగారు పలు సంవత్సరముల నుండి నెహెమ్యా గూటం గారి సహాయసహకారాలతో మంచిపని చేయుచున్నారు.

ఆగష్టు 12వ తేదీ ఆదివారం రామచంద్రపురం లెప్పర్ కోలనీలో యున్న క్రీస్తు సంఘారాధనలో రిక్కీ గూటం గారు వాక్యోపదేశము గావించిరి. ఆయన ఆంగ్ల ప్రసంగమును సోదరులు టి.వి.యన్ కుమార్ గారి కుమారుడు సుధీర్ తెలుగునకను వదించిరి. రిక్కీగారు ఆగష్టు 29న బయలుదేరి ఓక్లహోమా క్రిస్టియన్ యూనివర్సిటిలో మాస్టర్ ఆఫ్ బిజినెస్ (M.B.A) చేయుటకు తిరిగివెళ్లిరి. అక్కడకు క్షేమముగా చేరుకొనిరి.

బిక్కవోలు బైబిలు స్కూల్ సువార్తికులు సహవాస కూడిక ఆగష్టు 31వ తేదీనాడు బిక్కవోలు బైబిలు స్కూల్ ఆడిటోరియంలో ఘనముగా జరిగెను. పలు ప్రాంతముల నుండి సహోదరులు కూడిరాగా "నిజమైన సహవాసం" అనే అంశముపై వాక్యోపదేశము గావించబడెను. ఉదయకాల కూటమునకు సోదరులు M. సూర్యరావ్ (BBC Faculty) గారును, మధ్యాహ్నకాల కూటమునకు S. జాన్ (BBS Director) గారును అధ్యక్షత వహించిరి. జె.యస్. డేవిడ్ కింగ్, ఓ. ప్రభుదాసు, జాషువా గూటం, పి.యస్.ఆర్. జైపాల్ గార్లు నిజమైన సహవాసమును గూర్చి పలు ఉదాహరణలిస్తు దేవుని గ్రంథము నుండి మంచి పాఠములనందించిరి. సోదరులు యస్. జాన్, కె. ప్రసాదరావు (లొల్ల), మరియు బి. యేసురత్నం (గంటావారిగూడెం) గార్లు ప్రార్థనలు చేయుటలో సహకరించిరి. బిక్కవోలు బైబిలు స్కూల్ డైరక్టర్ S. జాన్‌గారు ఈ కూడికకు మంచి ఏర్పాట్లు చేసి చక్కగా నడిపినందుకు అభినందనీయులు.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/05/2001

From:

**SATYA VAKKU**
**P.O. BOX 80,**
**KAKINADA - 533 001**

To

Edited & Published and Owned by Joshua Gootam & Published at Satya Vani-Church of Christ & Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. KAKINADA - 533 004. Editor : Joshua Gootam